# మానవసేవయే మాధవ సేవగా భావించాలి

**లోకమందు పెక్కు భీకరకృత్యముల్**
**జరుగు కారణంబు అరయవలయు**
**స్వార్థరహిత సేవ సన్నగిల్లుటచేత**
**అర్థరహిత వాంఛలధికమయ్యె**

ప్రేమస్వరూపులారా!

అమూల్యమైన కాలమును అరనిముషమైనా వృథా చేయరాదు. జీవంబు సత్యమని తనయొక్క కర్తవ్యమును విస్మరించటంచేత మానవత్వముయొక్క దివ్యత్వమును కోల్పోతున్నాడు, మానవుడు. అర్థములేని మాటలచేత కాలమును వ్యర్థపరచి తాము యేదియో ఘన కార్యమును ఆచరించినట్లుగా విశ్వసిస్తున్నాడు, మానవుడు. సేవ ఒక పదునైన కత్తివంటిది. ఈ కత్తియొక్క సంగతి చక్కగా గుర్తించిన వ్యక్తియొక్క చేతియందు వుండినప్పుడే యిది గొప్ప ఉపకారము గావిస్తుంది. కానీ, కత్తియొక్క స్థితిగతులు గుర్తించనివాని చేతిలో యిది గొప్ప అపకారమునే చేస్తుంది. కత్తిని యే విధముగా ఉపయోగించుకోవాలి? ఎట్టికార్యమునందు దీనిని వినియోగపెట్టుకోవాలి? దీనిని యే రీతిగా పట్టుకోవాలి, అనే విషయాన్ని మొట్టమొదట గుర్తించాలి. కర్మకూడను యింతియే!

**ఆత్మ విశ్వాసము లేనివానికి అన్నీ సందేహములే!**

ఈ కర్మను మనము యేవిధముగా ఉపయోగపెట్టాలి? ఏ సమయసందర్భములందు దీనిని సద్వినియోగము చెయ్యాలి? దీనియొక్క మంచి చెడ్డలు యేమిటని చక్కగా గుర్తించినవారే యీ కర్మకాండలో కాలు పెట్టాలి. కర్మ తత్త్వమును గుర్తించలేని వ్యక్తులు యిట్టి కర్మకాండయందు ప్రవేశించి స్వార్థరహితమైన సేవలకు దూరమై పూర్తి స్వార్థ, స్వప్రయోజనములందే తమకాలమును అంకితము గావించటముచేత సేవయొక్క విలువ

srisathyasaivachanamrutam

సన్నగిల్లిపోయింది. కనుక, సేవకు ప్రప్రథమములో దానికి తగిన గుణములు మనయందున్నవా లేవా అనే ఆత్మ విచారణ సల్పాలి. దీనికి ప్రధానమైన గుణములు దయ, వినయము, త్యాగము. ఇట్టి గుణములు వుండిన వ్యక్తి మాత్రమే సేవయందు పాల్గొని, స్వార్థరహితమైన సేవలను సల్పి జగత్తుకు ఆదర్శవంతమైన మార్గమును అందించగలడు. అహంకారముచేత, ఆడంబరములచేత, అభిమానముచేత యిందులో ప్రవేశించిన వ్యక్తి యేమాత్రముకూడను సేవ చేయలేడు. అహంకారముచేత మానవత్వమునే అపహాస్యము చేస్తాడు, మానవుడు. అభిమానముచేత పశుత్వమును పొందుతాడు. ఆడంబరముచేత కృత్రిమ జీవితాన్ని గడుపుతాడు. కనుక ఆడంబరము వుండినంతకాలము, అహంకారము మానవునియందు చేరినంతకాలము, వీనికి ఆత్మవిశ్వాసము లభించదు. ఆత్మవిశ్వాసము లేనివానికి అన్నీ సందేహములే! ఇలాంటి సంశయములు కల్గినవాడు తనను తానే నమ్మలేడు. తనను తాను నమ్మని వ్యక్తి యితరులను యేరీతిగా నమ్మగలడు? తనను నమ్మక, యితరులను నమ్మలేని వ్యక్తి యీ సమాజములో సేవను యేరీతిగా సాగించగలడు?

**సేవకుడు కాక, నాయకుడు కాలేడు**

మొట్టమొదట, సేవలో పాల్గొనుటకు వుత్సాహపడే వ్యక్తులు అహంకారమును నిర్మూలము చెయ్యాలి. ఆడంబరమైన ప్రవృత్తులకు సమాధి కట్టాలి. అభిమానమును ఆవల నెట్టాలి. సేవకు, అహంకారము దూరము చేసుకోవటమే ప్రథమ కర్తవ్యము. అహంకారము పోయినప్పుడే వినయము ప్రాప్తిస్తుంది. వినయవంతుడే సమాజసేవలో పాల్గొనుటకు అధికారి అవుతాడు. కనుక ప్రతి మానవునియందు వుండిన దివ్యశక్తి యేకత్వమైనదని భావించి ఏకాత్మభావమును అభివృద్ధి పరచుకోవాలి. ఏకాత్మభావము లేనంతవరకుకూడను మానవుడు యీ సేవకు అధికారి కాలేడు. సేవకుడు కాక నాయకుడు కాలేడు. ఈనాడు సేవా విధానమును గుర్తించలేని వ్యక్తులే నాయకులు కావటంచేత లోకము యీ విధమైన అల్లకల్లోలములకు ఆలవాలమైంది. ప్రాచీన కాలమునుండి పవిత్ర భారతదేశము అనేక విధములైన త్యాగములకు, యోగమునకు, ఆలవాలమైంది. కర్మలందు అనేక త్యాగములు

sri sathyasai vachanamrutam

సల్పి నిస్వార్థమైన జీవితమును గడపిన వ్యక్తులు కోట్లాను కోట్లు గలరు. అయితే ఈనాడు దినదినమునకు త్యాగతత్త్వమనేది సన్నగిల్లిపోతున్నది. సేవా తత్పరులు కరవైపోయినారు. సేవపేరుతో తమను తాము మోసము చేసుకుంటున్నారు. 'సేవ' అనే పదము రెండక్షరములైనప్పటికిని అందులో మహత్తరమైన, అందమైన, అనంతమైన, అర్థము కూడి వుంటున్నది. తనను తాను మరచి దైవ చింతన హృదయమందు ప్రతిష్ఠింపచేసుకొని సర్వాత్మభావముచేత సల్పిన క్రియలకే 'సేవ' అని అర్థము. ఎవరికో పరులకు సేవ చేస్తున్నామనే భావము మనలో యేమాత్రము వుండరాదు. సర్వ కర్మలు భగవత్ప్రీత్యర్థమనే భావముచేత, త్యాగముచేత సేవను చేయాలి. ఇలాంటి త్యాగభావముచేత సేవలు సలిపే వ్యక్తులు ఎంతమంది కలరు? లేక పోలేదు. ప్రాచీన కాలమునుండి భారతదేశమునందు అనేక విధములుగా తమ జీవితములను దేశముకొరకు త్యాగముచేసి జీవించిన మహనీయులు ఎందరో కలరు. అలాంటి వ్యక్తులను మనము చింతించి, స్మరించి వారి ఆదర్శములను మనము అందుకొని వారి అడుగుజాడలలో మనము నడవాలి. వారి సేవాతత్త్వమును మనము చక్కగా అర్థము చేసుకోవాలి. ఇలాంటి మార్గమందు మనము ప్రవేశించినప్పుడే మనము తలపెట్టిన కార్యములలో మనము ఆశించిన ఫలితమును అందుకోగలము.

**దేశముకొరకు దేనికైనా త్యాగము చేయుటకు సిద్ధముగా ఉండాలి**

పల్లెలలో సేవ చాలా ప్రధానమైనది. ఏ అనుకూలములు లేక అనేక కష్టములకు, నష్టములకు గురియై ఆరోగ్యమును చెడుపుకొని నిస్సహాయస్థితిలో వున్నవారికి సేవలు గావించటము, వారికి చేదోడువాదోడుగా నిల్చటము అత్యవసరము. అయితే దీనికిముందు మన గుణములను మనము చక్క దిద్దుకోవాలి. భారతదేశముయొక్క నీతినిజాయతీలు ఎలాంటివని మొట్టమొదట మనము గుర్తించాలి. దేశముకొరకు దేనినైనా త్యాగము చేయటకు సిద్ధముగా వుంటుండాలి. దేశము అంటే మట్టికాదని, మానవులని గ్రహించాలి. మానవులకు సల్పు సేవనే మాధవసేవగా మనము భావించాలి. ప్రాచీనకాలమునుండికూడను 'లోకా స్సమస్తాః సుఖినో భవంతు' అన్న సూత్రాన్ని ఆధారము

చేసుకొని ఆనాటి ఋషులు, మునులు, పెద్దలు, రాజులు యిలాంటి సేవలో పాల్గొంటూ వచ్చారు.

**పరమపావనమైన భారతావనియందు**
**సహనమన్నదె మనకు చక్కదనము**
**వ్రతములన్నింటియందు వన్నెగాంచినయట్టి**
**ఘన సత్యశీలంబె కఠినతపము**
**మధుర భావంబేది మనదేశమందన్న**
**మాతృభావముకన్న మాన్యమెద్ది**
**ప్రాణంబుకంటెను మానంబె ఘనమను**
**మనదేశ నీతిని మంటగలిపి**
**నేటికిచ్చిరి పరదేశ నీతులరసి**
**వెస విచిత్రస్వేచ్ఛయను విచ్చుకత్తి**
**ఔరా ఏమందు భారతపాలనంబు!**
**ఏనుగెట్టుల తన బలమెరుగలేదో**
**అట్టులైనారు భారతీయులు నేడు**

కనుక, యిట్టి పవిత్ర చరిత్రతోకూడి భారతీయులము అనిపించుకుంటూ యీనాటి భారతీయులు పైన చెప్పిన విలువలకు సరితూగలేనివారుగా తయారౌతున్నారు.

**ఆచరణ ప్రధానముకాని, ఆడంబరము లేక ప్రచారము ప్రధానముకాదు**

వాగాడంబరమైన ప్రచారములలో, ప్రబోధలలో మనము మిన్నయని భావించుకుంటున్నామేగాని నిజానికి వీటిని కట్టిపెట్టాలి. ఈ ఉపన్యాసములచేత జగత్తు యేమాత్రము మారదు. నిరాడంబరమైన, నిస్స్వార్థమైన భావములచేత మనము క్రియలలో పాల్గొనాలి. Silent selfless work, దీనిని మనము ఆచరించుచూ ప్రబోధించాలి. ఆచరించకుండా మైకులముందు కూర్చుని యిష్టము వచ్చినట్లు మాట్లాడితే మనము విజయము సాధించలేము. భారతదేశమందు ఆచరణ ప్రధానముగాని, ఆడంబరము లేక

srisathyasaivachanamrutam

ప్రచారము ప్రధానముకాదు. సత్కర్మలచేత చాలవరకు సులభముగా లోకాన్ని మార్చవచ్చు. ఆడంబరమైన మాటలచేత కేవలము తాత్కాలికమైన తృప్తి కలుగవచ్చు. క్రమక్రమేణ యిది పతనమునకు మార్గమవుతుంది. మనము చేసే ప్రతి చిన్నకార్యమునందు తాత్కాలికమైన తృప్తులతో జీవితాన్ని వ్యర్థము చేయకూడదు. ఈ తాత్కాలికమైన సేవలన్నీకూడను దీపావళి రోజు చిచ్చుబుడ్లువలె వుంటుంటాయి, బుస్సని పైకి పోవటం తుస్సని దిగిపోవటం. ఈ విధమైన సేవలతో యేనాటికి ఫలితమును సాధించలేము. మనము యీనాడు గ్రామ సేవ విషయంలో నంబర్సు వేసుకుంటున్నాము. అంతా క్వాంటిటీనే! యిరవైవేలు, ముప్పైవేలు, ఐదువేలు, ఆరువేలు గ్రామాలలో సేవ చేస్తున్నామని. ఈ క్వాంటిటీని మనము చూడకూడదు. యీ statistics అంతా మూల పెట్టాలి. ఆచరణ రూపమైన క్రియలో ప్రవేశించేందుకు మనము నడుము కట్టాలి. ఇన్ని గ్రామములు అనే నెంబరే మరచిపోవాలి. ఎంత చేతనైతే, ఎంత శక్తి వుంటే అన్ని గ్రామాలకు మనము సేవ చేస్తూ పోవాలి. యింత కాలము సేవలు జరుగుతూనే వున్నాయి. అది సంతోషించవలసిన విషయమే! కానీ దానితో అంత తృప్తి కలగటంలేదు. కేవలము correspondence ను మాత్రమే అనుభవిస్తున్నాము, మేము యిన్ని గ్రామములు చేశాము అని యిక్కడనుండి correspondence. యిన్ని గ్రామములు చేయాలని అక్కడనుండి correspondence. యీ correspondence ను కట్టిపెట్టాలి. మన దేశాన్ని మనము గుర్తించాలి. సేవలు చేస్తున్నామంటే మన కండ్లు మాత్రమేకాదు. వేల కన్నులతో చూచే వారున్నారు జగత్తులో. మనము సేవ చేశామని చెప్పిన గ్రామానికి పోయి చూస్తే అక్కడ యేమి జరిగిందంటే యేమీ లేదు. ఇదా మనము చేయటము? ఏ కొద్ది చేసినా సరే మంచిగా, నీటుగా యితరులు గౌరవించేరీతిగా, మనకు తృప్తి కలిగే రీతిగా మనము చెయ్యాలి. మొట్టమొదట సాయి సంస్థలలోపల యీ వాగాడంబరాన్ని కట్టిపెట్టాలి. మాటాడేవాడు పని చేయడు, పనిచేసేవాడు మాటాడడు. ఎవరు మాట్లాడుతున్నారో వారు పని చేయనివారే! ఏదో యీనాడు నా ఉపన్యాసము వుందని దానిని కంఠస్థము చేసుకునేది, అక్కడిది యిక్కడిది తీసుకునేది, గ్రామఫోను ప్లేటులా వల్లించేది, యిదా మనము చేయవలసినది? ఇదా మనము చేయవలసిన సేవ? ఈ పని టేపు రికార్డుకూడా చేస్తుంది. మనము టేపురికార్డుకాదు. టైపురికార్డు. ఆదర్శమును

మనము అందించాలి. ఈ విధమైన సేవలలో పాల్గొన్న వ్యక్తే నిజమైన సేవకుడు.

**ప్రతిమానవుడుకూడా సేవకుడే!**

ఫలితముకోసము సేవ చేసేవాడు పనివాడౌతాడుగాని యజమానుడుకాదు. ఏ ఫలితమును మనము ఆశించకుండా పనిలో ప్రవేశించాలి. కనుక మనము ఫలితము ఆశించకుండా, నిస్వార్థమైన భావముచేత, నిరహంకార తత్త్వముచేత సేవలలో పాల్గొనాలి. ఇప్పుడు ఒక చిన్న ఉదాహరణము. మనము సేవకులము. ఈ భావమును మాత్రము మరువరాదు. ప్రతి మానవుడుకూడను సేవకుడే! ప్రభువుకు సర్వెంటు వుంటాడు. గురువుకు శిష్యుడు వుంటాడు. బిడ్డకు తల్లితండ్రులుంటారు. బిడ్డసేవచేసే తల్లి తండ్రులు, తల్లి తండ్రులకు సేవచేసే బిడ్డ. గురువు సేవ చేసేవాడు శిష్యుడు. శిష్యుని సేవ చేసేవాడు గురువు. శిష్యుడు లేక గురువనే సార్థక నామమే వుండదు. గురువులేక శిష్యుడు, శిష్యుడు లేక గురువు వుండడు. తండ్రి లేక కొడుకు, కొడుకు లేక తండ్రి లేడు. ఈ విధముగా విచారణ చేస్తే అందరూ సేవకులే! జగత్తంతయు సేవక భావముతోనే నిండివుంటున్నది. ఈ భావమును మొట్టమొదట హృదయములో భద్రము చేసుకోవాలి. 'పరోపకారార్థమిదం శరీరమ్'. శరీరము రావటము, పరోపకారముకోసమని. ఏమిటా ఉపకారము? వానికి చేతకానిది, మనము చేసి పెట్టటము. ఈ విధమైన సేవయందే మన జీవితమును సార్థకము గావించుకోవాలి. ఈ సేవా భావముచేతనే మానవుడు వున్నతోన్నత స్థితిని అందుకుంటాడు. కనుక మనము నిజముగా ఫలితమును ఆశించి సేవ చేయరాదు. ఈ ఫలితమును యేనాడు మనము త్యాగము చేస్తామో ఆనాడే మనలో సేవా భావము అభివృద్ధి అవుతుంది.

**ఎవరికో సేవ చేస్తున్నామనే భావమును విడిచిపెట్టాలి**

దేశములో అనేక రాష్ట్రములు వుంటున్నాయి. ఈ రాష్ట్రములలో అనేక పల్లెలయందు సాయి సంస్థల కార్యకర్తలు సేవలు చేశారు. ఒక్కొక్క రాష్ట్రములోపల కొన్ని వేల గ్రామములుంటున్నాయి. ఇన్ని పల్లెలయందు ఒక్క పల్లె మాత్రమే ఆదర్శమైన పల్లెగా మనము నిర్ణయిస్తుంటే యిది ఎంత అవమానకరమైన విషయము! నీవు సేవ చేసిన ఆదర్శవంతమైన విలేజ్ ఏమిటి? దీనికి కారణములు చెప్పండి చూద్దాం. ఒకనాడు పోయి

srisathyasaivachanamrutam

నగరసంకీర్తన చేస్తే యిది Ideal village. ఎట్లా అవుతుంది? ఒకనాడు పోయేది, పడిపోయిన స్కూలుకు సున్నము కొట్టేది, వచ్చేది. యిది Ideal గ్రామం అని చెప్పుకునేది. నిజానికి, ఇవి సేవలని చెప్పటానికే వీలులేదు. అవమానము. దీనిని ఎవరైనా పోయి ప్రత్యక్షముగా విచారణ సలుపుతున్నారా? పోనీ State President ఆ విలేజ్‌కి పోయి చూస్తున్నాడా? District President ఆ విలేజ్‌కి పోయి చూస్తున్నాడా? ఎవ్వరూ చూడటం లేదు. ఈనాడు Ideal Village అంటే ఎవరికని యీ ప్రైజ్ యివ్వాలి? State President కి యివ్వాలా? అతనికి ఆ పల్లె ఎక్కడుందో తెలియదు. District President కి యివ్వవలెనా? గ్రామములో యేమి సేవ జరిగిందో అతనికి తెలియదు. పోనీ, గ్రామానికి యేమైనా ప్రైజ్ యిస్తామా అంటే దానికి ఒక పంచభూత స్వరూపము లేదు. ఎవరికిచ్చేది ప్రైజు? ఎవరికి తీసుకునే అధికారము వుంది? తీసుకునే అధికారము ఎక్కడనుంచి వస్తుంది? అట్టి అధికారము లేనివారికి నేనుకూడను ప్రైజ్ యివ్వటానికి యిష్టపడను. అసలు ఈ పద్ధతే చాలా చెడ్డది. ఈ విధముగా చేయటంవలన ముమ్ముందు యింకా యీ సంస్థలయొక్క ఉత్సాహప్రోత్సాహములంతా సన్నగిల్లిపోతాయి. మిగిలిన వారంతాకూడను మా జిల్లాకు రాలేదే, మా గ్రామాలకు రాలేదే మేము చేసి యేమి ప్రయోజనమని వారు నిరుత్సాహ పడవచ్చు. దేశమునకంతా ఒక విలేజ్‌కి యిస్తే యింక వేరే విలేజ్ వాళ్లు యేవిధముగా అశాంతినొందుతారో మీరే యోచించుకోవచ్చు. ఇప్పటికి జరిగిపోయిన పొరపాట్లు యేవో జరిగిపోయాయి. ఇకనుంచైనా సేవ అనేది కేవలము ఎవరికో చేస్తున్నామనే పిచ్చి భావమును మీనుంచి దూరము చేసుకోవాలి. మీకు మీరే సేవ చేసుకుంటున్నామనే విశాలభావమును మీరు అనుభవించాలి. ఇతరులకు యేమైనా అనుకూలము చేసినా తనకు తాను చేసుకున్నట్లుగా భావించాలి. ఆ విధమైన సేవలో మీరు పాల్గొని యిన్నీ అన్ని అనే నంబర్లు విసర్జించి యిది నా కర్తవ్యము అనే భావముతో దీంట్లో పాల్గొనాలి. యీనాడు Workshop అనేది ఒకటి start చేశారు. Shop అంటే కేవలము show చేసేది. ఈ work ని మనము show చెయ్యరాదు. హృదయముతో అనుభవించాలి. వర్కర్సు అయిన మీరందరు దీనిలో వుత్సాహప్రోత్సాహములతో పాల్గొనాలి. ఈనాటి యువకులే భావి భారతోద్ధారకులు, దేశములో ఆవరించిన అభిమాన, మమకారములను దూరము గావించి ఆప్యాయత,

sri sathyasai vachanamrutam

కరుణ, దయ, త్యాగము అనే సచ్ఛీలగుణములను యువతలో పెంచాలి.

**సాయి క్వాలిటీ కోరతాడుగాని, క్వాంటిటీని కాదు**

ఇంకపైన ప్రతి village కూడను State President visit చెయ్యాలి. తాను బాధ్యత వహించటంచేత ఎంతైనా అభివృద్ధి గావించటానికి వీలవుతుంది. అలాంటిది చేతకానివాడు తనకు చేతకాదని చెప్పాలి. సాయి కేవలము క్వాలిటీ కోరుతున్నాడు గాని క్వాంటిటీని కోరటములేదు. కనుక మీరందరు ముమ్ముందు ఉత్సాహప్రోత్సాహములతో సేవలో పాల్గొని తగిన ధైర్యస్థైర్యములచేత దీనిని ఎదుర్కొనటానికి ప్రయత్నించాలి. మీకు కావలిసిన సద్గుణములు యివియే! జపము, ధ్యానము, యోగము, స్మరణ, పారాయణ యిలాంటివంతా మనము చేస్తున్నాము. కానీ దీనికి పునాదియైన త్యాగము, దయ, ప్రేమ, సహనము, సానుభూతి లేకుండా యీ ప్రక్రియలతో మనము యేమి సాధించగలము? సద్గుణములను పెంచుకున్నప్పుడే సాధనలో తగిన స్థాయి కుదురుతుంది. ఆ సద్గుణములు లేకుండా ఎంతసేపు నీవు ధ్యానములో కూర్చున్నా చంచలత్వాన్ని అనుభవిస్తావే గానీ ప్రశాంతిని నీవు యేమాత్రము పొందలేవు. 'చిత్తస్యశుద్ధయే కర్మః', అన్నారు. నీవు చేసే కర్మలవల్ల చిత్తశుద్ధి కలగాలి. చిత్తశుద్ధివల్లనే ఆత్మవిశ్వాసము కలుగుతుంది. ఆత్మవిశ్వాసముచేతనే ఆనందమును అనుభవిస్తాము. చిత్తశుద్ధే కలుగక ఆత్మవిశ్వాసము ఎలా కలుగుతుంది? యీనాడు మనము కేవలము సంకుచితమైన మార్గములో ప్రవేశిస్తున్నాము. మనము విశాలమైన భావాన్ని పెంచుకోవాలి. ప్రతి ఒక అధికారికూడను 'నేను యీ సత్యసాయి సంస్థలో చేరినందుకు యేమి చేస్తున్నాను, ఎంతవరకు చేస్తున్నాను, నాకు తృప్తిగా నేను చేస్తున్నానా లేదా', అని తనకు తాను పరీక్షించుకోవాలి. ఇలాంటి conference టైములో మాత్రము అందరూ attend అవుతారు. తరువాత వారి ముఖములే కనుపించవు. యిలాంటి ప్రవర్తన గలవారు అధికారులమని చెప్పుకోటం సిగ్గుచేటు. సంస్థలన్నీ నిల్చిపోయినా నాకు సంతోషమేగాని, యిలాంటి ప్రవర్తనలంతా నాకు యిష్టము లేదు.

## ప్రేమలేక ఏ సేవ చేసినా నిరుపయోగమైపోతుంది

క్రమక్రమేణా యివన్నీకూడను సాయికి వచ్చి చేరుతుంటాయి. కనుక ఈ సంస్థలను చక్కదిద్దడం నా బాధ్యతగా వుంటుండాది. ఈ చెప్పటం నా కర్తవ్యము. మనము చేసే సేవలన్నియు మనయొక్క ధన్యతకోసమే! కనుక self confidenceతో అనగా ఆత్మవిశ్వాసముతో మనము సేవలో ప్రవేశించాలి. 'సాయి నాకిది చేయలేదు, అది చేయలేదు', అని సాయిని మాత్రమే అంటారుగాని, సాయికి మీరు యేమి చేశారు? నీవు చేసింది చెప్పు, చూద్దాం! ఏమీ చేయటం లేదు. ఏది చేసినప్పటికిని స్వార్థము, స్వప్రయోజనము. అంతే తప్ప, సాయికి నీవు చేసిన పని యేమిటి? సాయికి చేయక, సాయినుంచి ఏరీతిగా ఫలితాన్ని పొందగలవు? షాపుదగ్గరకి పోయి దానికి చెల్లించవలసిన మూల్యము చెల్లించినప్పుడే అందుకోవలసిన వస్తువును అందుకోగలుగుతాము. ఆ మూల్యమును చెల్లించక పదార్థము కావాలంటే యిదెంత స్వార్థము? ప్రతిఫలము ఆశించని, నిస్వార్థమైన సేవను నీవు చేయి. నీకు సర్వము సాయి అనుగ్రహిస్తాడు. నీవు చేయవలసినది నీవు చేయక, సాయినుంచి పొందటానికి సిద్ధముగా వుంటుంటే ఏవిధముగా లభిస్తుంది? సంపాయించినది నిజముకాదు. నిజమైన ధనము దైవానుగ్రహమే! దైవానుగ్రహము పొందటానికి అన్ని విధములా త్యాగము చేయాలి. సేవకంటే మించినది మరొకటిలేదు. కనుక, ఎన్ని ధ్యానములు చేసినా, ఎన్ని జపములు చేసినా, ఎన్ని తపములాచరించినా, ఎంత వేదాన్ని ఉచ్చరించినాగాని లోపలి హృదయము పరిశుద్ధము కాకపోతే యివన్నీకూడను నిరుపయోగమే! మీ అందరికి తెలుసు. ఇడ్లీ సాంబారు చేసుకున్నామనుకోండి, తినాలని. ఈ సాంబారుకు బెంగుళూరునుండి చక్కని fresh కూరగాయలు తెచ్చిపెట్టుకున్నాం. మంచి బేడలు వేశాము. చింతపండు, తగిన సామానులంతా వేశాము. ఆ సాంబారు యిడ్లీ తిన్నాము. కాని, కడుపులో తిప్పింది. అన్నీ కొత్తవేనే! ఉత్తమమైనవే! కాని కడుపులో తిప్పింది. దీనికి కారణం యేమిటి? సాంబారు వండిన పాత్రకు కళాయి లేదు. మనము చక్కగా ధ్యానము చేస్తున్నాము. జపము చేస్తున్నాము. భజన చేస్తున్నాము రాగతాళములతో. యివన్నీ కూరగాయలు, ఉప్పు, పులుసు మాదిరి. కాని, హృదయమనే పాత్రలో ప్రేమ అనే కళాయి లేకపోతే యిదంతా

srisathyasaivachanamrutam

poison అయిపోతుంది. మొట్టమొదట హృదయములోపల ప్రేమ అనే దానిని పెట్టుకోవాలి. ప్రేమలేక ఏమిచేసినా నిరుపయోగమైపోతుంది.

**మనలో దోషములు చెప్పేవాడే మనకు నిజమైన గురువు**

ప్రేమస్వరూపులారా! స్వామి యింత కఠినముగా చెపుతున్నాడని మీరు యేమాత్రము బాధపడకూడదు. నిజముగా మనలోని దోషములు చెప్పేవాడే మనకు నిజమైన గురువు. మన దోషములను కప్పి పుచ్చినవాడే మహాద్రోహి. కనుక దీనిని మీకు హితముగా మీరు భావించాలి. దోషములంతా దూరము చేసుకోవాలి. ఇకముందైనా దోషరహిత చిత్తులు కావాలి. ఈ సేవ చాలా వుత్తమమైనది. వేసిన ప్లాను అంతా సక్రమమైనది. అయితే జరుపవలసిన వారు చక్కగా జరపాలి. ఇందులో ఎవరు ప్రధానము? అందరూకూడను దీనికి ఆధారమే. అందరియందు ఒక విధమైన ఐకమత్యము వుండినప్పుడే యిది సరైన రీతిగా జరుగుతుంది. World Council వారు, State Presidents, State convenors, District Presidents, District Convenors, సేవాదళమువారు, సేవా సమితి వారు, భజనమండలి వారు, అందరూ ఏకమైపోవాలి. ఈ ఐకమత్యముతో మనము పనిచేసినప్పుడే అనుకున్న ఫలితాన్ని అందుకుంటాము. ఈ cooperation అనేది తీసివేస్తే operation అయిపోయింది, యింక మన పని ఏమి చేయలేం, మనము. కనుక, నేటినుండి అందరు ఐకమత్యముచేత ఎవరెవరియొక్క భావాన్ని, ఎవరెవరియొక్క శక్తిని అనుసరించి, శక్తిలోపము లేకుండా, శక్తి హీనముకాకుండా సమాజ సేవలో పాల్గొనాలి. ఇదే నిజమైన సాధన.

**స్వామి చెప్పిన విషయములు అంతా మన మంచికోసమే అనే భావము పెంచుకోవాలి**

జపము, సాధన, యోగము, యజ్ఞము అన్నీ విడిచిపెట్టినా సరే, సేవలో మాత్రం మీరు పాల్గొనండి. నవవిధభక్తి మార్గములందు సేవ చాలా ఉత్తమమైనది. యీ సేవాభావముచేతనే దైవానుగ్రహము అందుకొనుటకు అర్హులమవుతాము. సేవ చేయకుండా కేవలము మాటలచేతగాని, ఉపన్యాసములచేతగాని, కాలమును వ్యర్థము చేయకూడదు. సేవ చేసేవాడు ఉపన్యాసము చెప్పినప్పుడే అది చక్కగా మన

హృదయమునకు హత్తుకుంటుంది. సేవ చేయక ఉపన్యాసములో హీరో మాదిరివుంటే ప్రయోజనంలేదు. 'నేను తరించాలి. నేను సరైన జీవితాన్ని అనుభవించాలి, ఆదర్శవంతమైన మానవునిగా తయారుకావాలి', అనుకుంటే నిస్వార్థమైన, నిర్మలమైన, నిరహంకారమైన సేవలో మనము పాల్గొనాలి.

ప్రతి దినము ఆత్మవిచారణ సల్పుకోవాలి. 'నాకిచ్చిన బాధ్యతలోపలే, నేనున్న స్థానములోపల నేను నాపనిని సక్రమముగా చేస్తున్నానా లేదా', అని తనకు తానే విచారించుకుని తృప్తిపడాలి. తనకే తృప్తిలేనిది యితరులను యేవిధముగా తృప్తిపరచగలడు? కనుక self satisfaction అత్యవసరము. self satisfaction కు పూర్వము self confidence ఆత్మవిశ్వాసము వుండాలి. త్యాగము చేసినప్పుడే self realisation చిక్కుతుంది. మనము కష్టములు, నష్టములు, దుఃఖములు ఎదుర్కొని సాధించటానికి ప్రయత్నించాలి. ఏ సంస్థ అయినా ముఖ్యముగా మన సత్యసాయి సంస్థలయందు, అహంకారము, ఆడంబరము, అభిమానము యీ మూడు వుంటే మనము పని చేయలేము. ఈ మూడింటిని త్యాగము చేసినవాడు సరైన సేవలో పాల్గొనుటకు అధికారి అవుతాడు. స్వామి చెప్పిన విషయములు అంతా మన మంచికోసమనే భావమును మీరు పెంచుకొని, తద్వారా జరిగిపోయినదంతా మరచి, రాబోయే జీవితానికి తగిన ఆదర్శముగా మీరు నిరూపించాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 21-11-1986న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**